

15 గేట్ల ద్వారా నీటి విడుదల

పులిచింతల ప్రాజెక్టు 15 గేట్లతోపాటు విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 3,25,932 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. - 8లో



నిస్వార్థ సేవకు చిరునామా..

నిస్వార్థ సేవకు చిరునామా కోణం ఫౌండేషన్ అని రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి అన్నారు. - 8లో



సమగ్ర దర్యాప్తు జరిపించాలి

సుంకిశాల పంప్‌హౌస్ సైడ్‌వాల్ కూలిన ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని సీపీఎం నేత రంగారెడ్డి డిమాండ్ చేశారు. - 8లో

చూసొద్దాం.. అందాల సాగర్

సండే స్పెషల్



ప్రపంచ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్. ఇక్కడి బుద్ధవనం, పచ్చని అటవీ ప్రాంతం, ఎత్తిపోతల జలపాతం, స్పిల్‌వే మీదుగా కృష్ణమ్మ ఉరకలు, అనుపు, లాహిరి లాహిరి లాహిరిలో అనేలా లాంచీ ప్రయాణం, నాగార్జునకొండ ఇలా.. సాగర్‌లో ప్రతి ప్రాంతం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

ప్రత్యేక కథనం 8లో



నిండు సాగరం సాగర్ జలాశయం వద్ద శనివారం 3,36,708 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. 3,41,785 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. నీటిమట్టం 588 అడుగులు (306.1010 టీఎంసీలు)గా ఉంది. జలాశయం నిండుకుండను తలపిస్తోంది.

న్యూస్‌రీల్

శిక్షణ తరగతులకు తరలి రావాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ ప్రతినిధులు, విద్యార్థులు

భానుపురి (సూర్యాపేట): ఈ నెల 16వ తేదీ నుంచి మూడు రోజులపాటు సిద్దిపేటలో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులకు ప్రతినిధులు, విద్యార్థులు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్ కోరారు. శనివారం సూర్యాపేటలోని ఆ సంఘం కార్యాలయంలో శిక్షణ తరగతుల కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి పీడీఎస్‌యూ 50 ఏళ్లుగా ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, నాయకులు పిడమర్తి భరత్, పూజిత, మహేశ్వరి, స్వాతి, సంధ్య, మహేష్, మనోజ్, విజయ్ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

సూర్యాపేట: ఈ నెల 25వ తేదీన సూర్యాపేటలో నిర్వహించనున్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఐతగోని రాంబాబుగౌడ్, పాల్వాయి జానయ్య పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు ఉచిత వైద్యం అందేలా హెల్త్ కార్డులు చెల్లుబాటు చేయాలన్నారు. జర్నలిస్టుల పిల్లలందరికీ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఉచిత విద్య అందించాలని, జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టాలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాయిని శ్రీనివాసరావు, వెంకట్‌రెడ్డి, ఎరుకల సైదులుగౌడ్, సైదులు, రామారావు, రెడ్డి భిక్షం రూథర్, దోసపాటి అజయ్‌గౌడ్, వేల్పుల ప్రవీణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



సూర్యాపేటలోని బీసీ హాస్టల్‌లో మాట్లాడుతున్న శ్రీకాంత్‌వర్మ

సూర్యాపేట టౌన్: సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దనియాకుల శ్రీకాంత్‌వర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సంక్షేమ వసతి గృహాల్లో సర్వే నిర్వహించి మాట్లాడారు. సంక్షేమ వసతి గృహాలకు పక్కా భవనాలు లేక అద్దె భవనాల్లో అరకొర వసతుల నడుమ విద్యార్థులు కాలం వెల్లదీస్తున్నారన్నారు. అద్దె భవనాల యజమానులకు ప్రభుత్వం మూడు సంవత్సరాలుగా అద్దె చెల్లించకపోవడం దారుణమన్నారు. వార్డెన్లు, వర్కర్ల నిర్లక్ష్యంతో హాస్టళ్లలో మెనూ సక్రమంగా అమలుకావడం లేదని, దీంతో విద్యార్థులు నీళ్ల చారుతో ముద్దలుగా ఉన్న అన్నం తినాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బానోతు వినోద్‌కుమార్, అక్కినపల్లి వినయ్, మధు, గణేష్, సంతోష్, సందీప్ పాల్గొన్నారు.

యాదాద్రిలో విశేష పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం సంప్రదాయ పూజలు విశేషంగా చేపట్టారు. వేకువజామున అర్చకులు స్వయంభూలకు ప్రభాత సేవ చేపట్టి నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం వేళ జోడు సేవలను ఆలయ మాడవీధిలో ఊరేగించారు.

జోరుగా వరిసాగు

- అరకొర వర్షాలతో ఆలస్యంగా సాగు పనులు
- నాగార్జునసాగర్, మూసీ నీటి విడుదలతో ముమ్మరం
- నెలరోజుల పాటు నాట్లు వేసే అవకాశం
- ఇప్పటి వరకు 1.50 లక్షల ఎకరాల్లో సాగు



పాలకవీడులో నాట్లు వేస్తున్న కూలీలు

భానుపురి (సూర్యాపేట): జిల్లాలో వరిసాగు పనులు జోరందుకున్నాయి. అరకొర వర్షాలతో వానాకాలం ప్రారంభమై రెండు నెలలు గడిచినప్పటికీ ఆశించిన స్థాయిలో సాగు పనులు ముందుకు సాగలేదు. మెట్టపంటల సాగు నుంచి.. వరిసాగు వరకు తీవ్ర ఆలస్యమైంది. ప్రస్తుతం నాగార్జునసాగర్, మూసీ కాల్వలకు నీటిని విడుదల చేయడంతో సాగు పనులు ముమ్మరమయ్యాయి. ఇప్పటివరకు జిల్లాలో 2,35,000 ఎకరాల్లో వివిధ పంటల సాగు జరగ్గా.. మరో నెల రోజులపాటు వరి సాగయ్యే అవకాశముంది.

సాగు అంచనా 6.34 లక్షల ఎకరాలు

జిల్లాలో 2024–25 సంవత్సరానికి గాను 6,34,400 ఎకరాల్లో వివిధ పంటలు సాగు అవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో అత్యధికంగా వరి 4,65,500 ఎకరాల్లో ఉంటుందని భావించారు. అయితే వానాకాలం సీజన్ ప్రారంభమైన నాటినుంచి కూడా జిల్లాలో పెద్దగా వర్షాలు పడలేదు. కేవలం మెట్ట పంటలకు సరిపడేలా మోస్తరు వర్షాలు మాత్రమే పడ్డాయి. దీనికి తోడు గతేడాది కూడా వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. ఇప్పటి వరకు జిల్లాలో వరి 1.50 లక్షల ఎకరాలు, పత్తి 77,154 ఎకరాలు, కంది 1,140 ఎకరాలు, పెసర 2,334, వేరుశనగ 175, చెరుకు 40, పచ్చిరొట్ట 4,073, మొక్కజొన్న 26, ఇతర పంటలు 58 ఎకరాల్లో సాగయ్యాయి. మొత్తంగా ఇప్పటి వరకు 2,35,000 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు.

గతేడాదితో పోల్చితే..

గతేడాది ఇదే సమయానికి 4లక్షల ఎకరాల వరకు జిల్లాలో వివిధ పంటల సాగు చేశారు. కానీ, ఈ ఏడాది అందులో సగానికిపైగా విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యాయి. గతేడాది సాగర్ ఆయకట్టుకు నీటి విడుదల లేనప్పటికీ భూగర్భ జలాలను ఆధారంగా చేసుకొని కొంతమేర పంటలు సాగు చేశారు. ప్రస్తుత సీజన్‌లో ఎస్సారెస్పీ ఆయకట్టుకు నీటి విడుదల సందిగ్ధంలో పడి 2.20 లక్షల ఎకరాల భూములు బీళ్లుగా మారాయి. ఇటీవలే సాగర్, మూసీ నీటి విడుదలతో ఆయకట్టులో వరిసాగు పనులు జరుగుతున్నాయి. సాగర్ ఆయకట్టు పరిధిలో మరో నెల రోజుల పాటు నాట్లు పడే అవకాశం ఉంది. పది రోజుల్లో ఎస్సారెస్పీ ఆయకట్టుకు కూడా నీటి విడుదల విషయం తేలనుంది.

నెలరోజుల పాటు నాట్లు పడతాయి



సాగర్ ఆయకట్టుకు ఆగస్టులోనే నీటిని విడుదల చేస్తుంటారు. ఈ ప్రాంతంలో స్వల్పకాలిక పంటలను సాగు చేస్తారు. కావున ఎలాంటి ఇబ్బందులు రావు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులను సిద్ధంగా ఉంచాం. జిల్లాలో మరో నెలరోజుల పాటు వరినాట్లు పడతాయి.

– శ్రీధర్‌రెడ్డి, డీఏఓ, సూర్యాపేట



ట్రాక్టర్‌తో పొలం దమ్ము చేస్తున్న రైతు

నేడు ఊర ముత్యాలమ్మ పండుగ



తొలి బోనంతో కోడి శివ కుటుంబ సభ్యులు, సర్వోత్తంరెడ్డి, వేణారెడ్డి తదితరులు



ముస్తాబైన ముత్యాలమ్మ ఆలయం

- ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయ కమిటీ సభ్యులు
- అమ్మవారికి తొలి బోనం సమర్పణ


భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కృష్ణాటాకీస్ సమీపంలో గల ఊర ముత్యాలమ్మ పండుగకు ఆలయం ముస్తాబైంది. ఏటా శ్రావణమాసంలో పట్టణంలోని భక్తులంతా అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. ఇందులో భాగంగా అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు ఆదివారం తెల్లవారుజారు జాము నుంచే ప్రత్యేకంగా పూజించిన బోనాలను తీసుకొచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అలమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లిస్తారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు గాను మున్సిపల్, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. వివిధ రంగులతో ఆలయాన్ని ముస్తాబు చేయడంతో పాటు విద్యుత్ దీపాలతో అలంకరించారు.

బోనాల పండుగ.. సంప్రదాయాలకు ప్రతీక

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బోనాల పండుగ అని ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని 25వ వార్డుకు చెందిన కోడి లక్ష్మయ్య– నరసమ్మ ఇంటి నుంచి తొలి బోనం ఎత్తి పట్టు చీర, పసుపు కుంకుమ, గాజులు, జలబిందెలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల వేణారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పీఎస్ హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలి

- డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

సూర్యాపేట టౌన్: ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేసి ఎస్జీటీలకు న్యాయం చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన పదోన్నతుల ప్రక్రియలో తమకు అన్యాయం జరిగిందని ఎస్జీటీ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. వారికి కూడా ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేసి ఉమ్మడి ప్రాతిపదికన బీఈడీ వారికి కూడా ప్రమోషన్ అవకాశం కల్పించాలన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులందరినీ రిలీవ్ చేసి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగయ్య, ప్రధాన కార్యదర్శి బీవీ.రావు, ప్రతినిధులు ఎం.దశరథ రామారావు, పి.వెంకటేశ్వర్లు, యోగానంద్, సీహెచ్.కవిత, సీహెచ్.వెంకటేశ్వర్లు, ఆనంద్ భాస్కర్, రమణ, వేణు, ప్రభాకర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం అమానుషం

భానుపురి (సూర్యాపేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ నగరంలోని స్వరాజ్ మైదానంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహంపై దాడి చేసి ధ్వంసం చేయడం అమానుష చర్య అని మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తళ్లమల్ల హస్సేన్ అన్నారు. శనివారం సూర్యాపేట పట్టణంలో నిర్వహించిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటుచేసి ఆవిష్కరించారని తెలిపారు. ఈ విగ్రహ శిలాఫలకంపై తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు దాడి చేసి ధ్వంసం చేయడం తీవ్రమైన నేరమని, దుండగులను గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి దాసరి దేవయ్య, జిల్లా అధ్యక్షుడు అఖిల్, వర్కింగ్ ప్రెసిడెంట్ వేణు, ప్రధాన కార్యదర్శి నరసయ్య, సలహాదారుడు గోపయ్య, వెంకట నరసయ్య, న్యాయవాదులు అశోకు, సైదులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శనివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్చరణల నడమ విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీస్వామిఅమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. అనంతరం కల్యాణతంతు పూర్తిచేసి శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా శుక్రవారం రాత్రి వచ్చిన భక్తులు ఆలయంలో బసచేసి శనివారం తెల్లవారుజామున కృష్ణానదిలో పుణ్య స్నానాలు చేసి శ్రీస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

30 నుంచి రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

చిలుకూరు: తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్, తెలంగాణ ఒలింపిక్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30, 31, సెప్టెంబర్ 1వ తేదీన యాద్రాద్రి భువనగిరి జిల్లా భూదాన పోచంపల్లిలో రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జరుగుతాయని వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు యడవెల్లి పుల్లారావు శనివారం తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఐడీ కార్డులతో కేటగిరీల వారీగా పేర్లు నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు. ముందుగా పేర్లు నమోదు చేయించుకున్నవారు మాత్రమే పోటీలకు అర్హులని తెలిపారు. ఆసక్తి గలవారు పూర్తి వివరాలకు సెల్ : 70133 01553, 99661 48808 నంబర్లను సంప్రదించాలని కోరారు.

చెరువు అలుగుకు గండి

- పంటపొలాల మీదుగా పారుతున్న వరద
- నీట మునిగిన సుమారు 50 ఎకరాలు
- ముకుందాపురం గ్రామంలో ఘటన



వరద నీటిలో మునిగిన పొలాలు

మునగాల: మండలంలోని ముకుందాపురం గ్రామంలో గల తిప్పాయికుంట చెరువు అలుగుకు శనివారం కొందరు రైతులు జేసీబీ సాయంతో గండి పెట్టారు. దీంతో ఆయకట్టులో సాగుచేసిన వరిపైర్లు నీట మునిగాయి. తిప్పాయికుంట ఎగువన సాగర్ ఎడమ కాలువ అనుబంధంగా ఉన్న ముక్త్యాల బ్రాంచి కాలువ ఉంది. ఈ కాలువ నీరు ఈ కుంటలోకి చేరడంతో కుంట పూర్తిస్థాయిలో నిండింది. దీంతో చెరువు ఎగువ భాగాన ఉన్న కొందరి రైతుల పట్టాభూములు మునిగిపోయాయి. దీంతో సదరు రైతులు శనివారం జేసీబీ సాయంతో అలుగుపై గతంలో పోసిన మట్టికట్టను తొలగించారు. దీంతో చెరువు కింద ఇటీవలే నాట్లుపెట్టిన సుమారు 50ఎకరాల వరిపొలాలు నీట మునిగాయి. గండి పెట్టిన విషయం తమ దృష్టికి వచ్చిందని, విచారణ చేసి బాధ్యులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని నీటిపారుదల శాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. సంఘటన స్థలాన్ని నీటిపారుదల శాఖ డీఈ సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. కాగా, ఇదే విషయమై రైతులను వివరణ కోరగా గతేడాది వర్షాలు కురవకపోవడం, సాగర్ నీరు విడుదల చేయకపోవడంతో చెరువులో నీరు నిల్వ ఉండేందుకు అలుగుపై అదనంగా మట్టితో కట్టపోశామని.. అదే కట్టను తొలగించాం తప్ప అలుగుకు గండి పెట్టలేదని పలువురు పేర్కొన్నారు.



చెరువు అలుగు వద్ద నుంచి కిందికి పోతున్న నీరు

కృష్ణాతీరం.. కిక్కిరిసిన జనం

- సాగర్‌కు భారీగా తరలివచ్చిన పర్యాటకులు

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్‌లో కృష్ణానది హొయలను చూసేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రజలు శనివారం భారీగా తరలివచ్చారు. దీంతో సాగర్ పరిసరాలన్నీ కిటకిటలాడాయి. కృష్ణానది ఇరువైపుల మూడు కిలోమీటర్ల మేర జనంతో నిండిపోయింది. నాగార్జునసాగర్ నుంచి హాలియా రోడ్డు, సాగర్ నుంచి పెద్దవూర రోడ్డుపై వాహనాలు బారులుదీరాయి. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు సఫలీకృతులయ్యారు. నదీతీరంలో ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా.. ఎక్కడికక్కడ భద్రతా చర్యలు చేపట్టారు.

కొత్త బ్రిడ్జిపై బారులుదీరిన వాహనాలు

సాగర్ కొత్త బ్రిడ్జి పొడవునా రెండు వరుసల్లో వాహనాలు కిక్కిశాయి. నదికి ఆవలి వైపుకు వెళ్లిన పర్యాటకులు ఇబ్బందులు పడ్డారు. చాలామంది ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు.

బుద్ధవనానికి సందర్శకుల తాకిడి

పర్యాటకులతో హోటళ్లు కిటకిటలాడాయి. బుద్ధవనం సందర్శకులతో నిండిపోయింది. టికెట్ల విక్రయం ద్వారా రూ.లక్షల్లో ఆదాయం వచ్చింది. ఎండ విపరీతంగా ఉండటంతో మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు.

ఆదివారం సెలవుదినం కావడంతో పర్యాటకుల సంఖ్య భారీగా పెరిగే అవకాశముంది.



లాంచీ స్టేషన్ వద్ద పర్యాటకుల సందడి



ఒడ్డుకు చేరిన లాంచీలు

సాగర్‌లో ఆగిన లాంచీలు

నాగార్జునసాగర్ : సాగర్‌లో లాంచీలు శనివారం నిలిచిపోయాయి. దీంతో పర్యాటకులు నిరాశతో వెనుదిరిగారు. పర్యాటక సంస్థకు రూ.లక్షల్లో ఆదాయం కోల్పోయింది. విజయ విహార్‌నుంచి లాంచీస్టేషన్‌ను గురువారం డౌన్ పార్కు వద్దకు మార్చారు. ఇక్కడ అన్ని వసతులు లేకపోవడంతో ఇక్కడి నుంచి లాంచీలను విజయవిహార్‌కు తీసుకుపొమ్మని చెప్పినట్లు సమాచారం. శుక్రవారం నాగార్జునకొండలో మ్యూజియం ఉండదు. దీంతో లాంచీలు కేవలం జాలీట్రిప్పులు నడిపారు. మరుసటి రోజు 4 లక్షల క్యూసెక్కుల వరద వస్తుంది. లాంచీలను నిలిపివేయాలని డ్యాం అధికారులు అనుమతిని నిరాకరించినట్లు సమాచారం. ఆంధ్రా వైపు లాంచీలు మాత్ర యథావధిగా నడిచాయి. అయితే.. ఆంధ్రా లాంచీలకు లేని ప్రమాదం లేని వరద ప్రమాదం తెలంగాణవాటికే ఉంటుందా అని పలువురు పర్యాటకులు ప్రశ్నించారు. దీంతో వారికి సమాధానం చెప్పలేక డైన్‌పార్కు నుండి సంబంధిత లాంచీ సిబ్బంది వెళ్లి పోయారు.



కొత్త బ్రిడ్జి పైన నిలిచిపోయిన వాహనాలు

గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి


చంద్రయ్య (ఫైల్)

కొండమల్లేపల్లి: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని సాగర్ రోడ్డులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండలం చింతకుంట్ల గ్రామానికి చెందిన గోరెటి చంద్రయ్య అలియాస్ గంటెల చంద్రయ్య(55) కొండమల్లేపల్లిలో ప్లాస్టిక్ సీసాలు, తాగేసిన బీరు సీసాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున 5.30 గంటల ప్రాంతంలో సాగర్ రోడ్డులోని సెంట్రల్ బ్యాంక్ ఎదుట గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో చంద్రయ్య తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చంద్రయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య ఈదమ్మ, కుమారుడు ఉన్నారు. మృతుడి కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ సీత్య నాయక్, హెడ్‌కానిస్టేబుల్ జగన్ తెలిపారు.

అదుపుతప్పి ఆటో బోల్తా.. ఒకరు మృతి

- నలుగురికి గాయాలు

కోదాడరూరల్: ఆటో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడడంతో అందులో ప్రయాణిస్తున్న వ్యక్తి తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. మరో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్ వద్ద జరిగింది. శనివారం ఎస్‌ఐ ఏ. రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు మండలం కట్టకమ్మగూడేనికి చెందిన మాదంశెట్టి కోటేశ్వరరావు(61) శుక్రవారం మఠంపల్లి మండలం పెద్దవీడుకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో హుజూర్‌నగర్ నుంచి ఆటోలో కోదాడకు వస్తుండగా.. మార్గమధ్యలో కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్ వద్ద ఆటో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వరరావు తీవ్రగాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం అతడిని కోదాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఖమ్మంకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న చింతల కళావతి, నర్రా వీరమ్మ, గంగరాజు, రమ్యకు తీవ్ర గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం ఖమ్మంకు తరలించారు. మృతుడి కుమారుడు రత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

16తులాల బంగారం, రూ.లక్ష అపహరణ

మోటకొండూర్: గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి 16తులాల బంగారం, రూ.లక్ష నగదు అపహరించారు. ఈ ఘటన మోటకొండూర్ మండలం కాటేపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటేపల్లి గ్రామానికి చెందిన నష్టిడి యాదిరెడ్డి శనివారం తన భార్య, కొడుకుతో కలిసి తమ వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. సాయంత్రం 4గంటల సమయంలో యాదిరెడ్డి కోడలు తన పిల్లలను ఆడిస్తూ ఇంటి తలుపులు దగ్గర వేసి ఎదురింటికి వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత తమ ఇంటి వైపు చూడగా తలుపులు తెరిచి ఉండటం గమనించి ఇంటి ఎదుట కిరాణ దుకాణం నడిపే వ్యక్తిని తీసుకుని ఇంట్లోకి వెళ్లి చూసింది. సామాను చిందరవందగా పడి ఉండటం గమనించి వెంటనే అత్తమామలకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. వారు ఇంటికి వచ్చి చూడగా.. రూ.లక్ష నగదు, 16 తులాల బంగారం కనిపించకపోవడంతో లబోదిబోమన్నారు. పోలీసులకు సమాచరం అందించగా ఎస్‌ఐ పాండు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

ఉరేసుకుని గుర్తుతెలియని యువకుడి ఆత్మహత్య



నల్లగొండ క్రైం: పట్టణంలోని లతీఫ్‌సాహెబ్ గుట్టపై గుర్తుతెలియని యువకుడు శనివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వయస్సు 28 సంవత్సరాలు ఉంటుందని, ముస్లిం వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో ఎక్కడ నుంచి గుట్టపైకి వచ్చాడనే విషయంపై పోలీసులు సీసీ కెమెరా పుటేజీలు పరిశీలిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీ పార్కు వద్ద పట్టణానికి చెందిన ఎండీ ఖాజా శనివారం గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు అరెస్ట్ పట్టుకున్నారు. నిందితుడు హైదరాబాద్‌లోని ధూల్‌పేట్‌లో గంజాయి కొనుగోలు చేసి స్థానికంగా అమ్ముతున్నట్లు తెలిపారు. అతడి వద్ద ఉన్న 10గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌ఐ కుమారస్వామి తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

మోటకొండూర్: గ్రామ పంచాయతీ వీధి లైట్లు మారుస్తుండగా విద్యుదాఘాతానికి గురై యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మోటకొండూర్ మండలం ఇక్కుర్తి గ్రామంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇక్కుర్తి గ్రామంలో వీధి లైట్లు వెలగకపోవడంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి లైన్‌మెన్‌కు సమాచారం ఇచ్చాడు. దీంతో కరెంట్ పని తెలిసిన గ్రామానికి చెందిన అయిలి గిరిధర్‌ను వీధి లైట్లు మార్చాల్సిందిగా కోరారు. ఈ మేరకు సాయంత్రం ఎల్‌సీ తీసుకోకుండా కారోబార్‌తో కలిసి స్తంభాల పైకి ఎక్కి గిరిధర్ వీధి లైట్లు మారుస్తుండగా.. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. అతడికి తీవ్ర గాయాలు కాగా వెంటనే ఆటోలో ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు.

పరామర్శించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య..

కాంగ్రెస్ నాయకుడైన గిరిధర్‌ను శనివారం ఆస్పత్రికి వెళ్లి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఝెల్లంల సంజీవరెడ్డి, బోయిని ఝాన్సీ, ఎలిమినేటి జంగారెడ్డి ఉన్నారు.

చూసొద్దాం..

అందాల సాగర్

అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా మారి కొత్త అందాలను సంతరించుకుంది. వారం రోజులుగా ప్రాజెక్టు క్రస్ట్‌గేట్ల నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఈ దృశ్యాలు పర్యాటకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. సాగర్ వద్ద లాంచీల్లో జలాశయంలో విహరిస్తూ నాగార్జునకొండకు వెళ్లడం పర్యాటకులకు మరుపురాని అనుభూతి. ఆ అనుభూతిని పొందేందుకు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి నిత్యం వేలాది మంది పర్యాటకులు తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో వారికి వసతి, భోజన సౌకర్యాలు, సాగర్ చుట్టుపక్కల సందర్శనీయ స్థలాలపై ప్రత్యేక కథనం.

\- నాగార్జునసాగర్

- పర్యాటకులకు స్వర్గధామం 'నందికొండ'
- చెప్పలేని అనుభూతిని మిగిల్చే లాంచీ విహారం
- చరిత్రకు సజీవసాక్ష్యంగా నిలిచే బుద్ధవనం, నాగార్జునకొండ మ్యూజియం



బుద్ధవనం



సాగర్ జలాశయతీరంలో 274 ఎకరాల్లో బుద్ధవనం నిర్మితమైంది. ప్రపంచంలోని బౌద్ధవాసనలు కలిగిన దేశాల్లో బుద్ధుడికి సంబంధించిన స్మృతులు బుద్ధవనంలోని మహాస్థూపం డోమ్‌పై చెక్కబడ్డాయి. సిద్ధార్థుడి జననం, బాల్యం, తదితర దశల్లో వ్యవహరించిన తీరు బుద్ధవనాన్ని సందర్శించి తెలుసుకోవచ్చు. బుద్ధవనం సందర్శనకు పెద్దలకు టికెట్ ధర రూ.100. పిల్లలకు రూ.50. ఇక్కడ ఐదు గదులు ఉన్నాయి. వీటిని అద్దెకు ఇస్తారు. ఏసీగది రూ.1500, నాన్ ఏసీ రూ.1200 ఉంటుంది. ఇతర వివరాలకు ఫోన్ నంబర్ 97058 15303ను సంప్రదించవచ్చు.

ప్రధాన జలవిద్యుత్ కేంద్రం



సాగర్ డ్యాం దిగువ ప్రాంతంలో ప్రధాన జల విద్యుత్ కేంద్రం ఉంటుంది. ఈ జల విద్యుత్ కేంద్రాన్ని సాగర్ జెన్‌కో ఎస్‌ఈ అనుమతి తీసుకొని సందర్శించాల్సి ఉంటుంది.

చేపలకూర ప్రత్యేకం

నాగార్జునసాగర్‌లో చేపలకూర, ఫ్రై ప్రత్యేకం. ఇక్కడ రోడ్ల వెంట చేపలకూరతో పాటు భోజనం వండి ఇచ్చే వారు రోడ్లవెంట డేరాలు వేసుకుని కనిపిస్తారు. ప్రస్తుతం సాగర్ 26 రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుండటంతో నిత్యం వేల సంఖ్యలో పర్యాటకుల వస్తున్నారు. దీంతో ఈ డేరా హోటల్స్ జనంతో కళకళలాడుతున్నాయి.

మనస్సుదోచే ఎత్తిపోతల జలపాతం

సాగర్ నుంచి మాచర్లకు వెళ్లే రహదారిలో 14 కిలోమీటర్ల దూరంలో ఎత్తిపోతల జలపాతం ఉంది. చంద్రవంక వాగుపై సహజసిద్ధంగా ఏర్పడిన జలపాతం వద్ద 70అడుగుల పైనుంచి జాలువారే నీటి దృశ్యం పర్యాటకుల మనస్సు దోచుకుంటుంది. జలపాతం చూసేందుకు టికెట్ ధర పెద్దలకు రూ.30, పిల్లలకు రూ.20. ఇక్కడ పర్యాటకుల సౌకర్యార్థం రాత్రి బస చేసేందుకు 8 రూములు ఉన్నాయి. ఇతర వివరాలకు ఫోన్‌నంబర్ 94414 53115ను సంప్రదించవచ్చు.



నాగార్జునకొండ మ్యూజియం


మ్యూజియం

నాగార్జునకొండ ప్రపంచంలోనే రెండవ ఐలాండ్ మ్యూజియం. కొండకు వెళ్లాలంటే హిల్ కాలనీ లాంచీస్టేషన్ నుంచి 20 కిలోమీటర్ల దూరం కృష్ణానదిలో ప్రయాణం చేయాలి. కొండకు చేరుకునేందుకు లాంచీలో గంట సమయం పడుతుంది. సాగర్ పరిధిలోని హిల్‌కాలనీ లాంచీస్టేషన్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు లాంచీలు పర్యాటకులకు అందుబాటులో ఉంటాయి. లాంచీ టిక్కెట్టు ధర పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.150, మ్యూజియం, మాన్యుమెంట్ సందర్శనకు రూ.30. 15 సంవత్సరాలలోపు చిన్నారులకు ఉచితం. విజ్ఞాన యాత్రకు గ్రూపుగా వచ్చే విద్యార్థులకు లాంచీ టిక్కెట్‌పై 15శాతం రాయితీ ఉంటుంది.



గత ఆనవాళ్లకు చిరునామా అనుపు

హిల్‌కాలనీకి 15 కిలో మీటర్ల దూరంలో అనుపు పర్యాటక కేంద్రం ఉంది. ఇక్కడ ఆనాటి నాగార్జున విశ్వవిద్యాలయం, ఇక్ష్వాకుల కాలం నాటి యాంఫీ స్టేడియం ఆనవాళ్ల ఉన్నాయి. కృష్ణానది లోయలో లభించిన రంగనాథస్వామి దేవాలయాన్ని అదే రాతితో అనుపులోని కృష్ణానది తీరంలో నిర్మించడం విశేషం.


అనుపు

సాగర్‌మాత పుణ్యక్షేత్రం



విజయపురిసౌత్‌లోని కృష్ణానది తీరంలో సాగర్ మాత దేవాలయానికి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తుంటారు. భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా సాగర్‌మాతకు పేరు ఉంది. ఇక్కడ నెలకొల్పిన జపమాల క్షేత్రం రాష్ట్రంలోనే ప్రత్యేకతను పొందింది.



సండే స్పెషల్

ముఖ్యమైన ఫోన్ నంబర్లు

హిల్‌కాలనీ లాంచీస్టేషన్: 7997951023
ఎత్తిపోతల: 9441453115, 9494347946
విజయపురి నార్త్ ఎస్‌ఐ: 8712670197
సాగర్‌మాత దేవాలయం 9581642488

- ఫైలాన్‌కాలనీలో టైగర్ వ్యాలీ హోటల్ (ఫోన్ నంబర్ 9154393031)
- పార్కిన్ హోటల్ అండ్ రెస్టారెంట్ (ఫోన్ నంబర్ 7993750209)
- విజయపురిసౌత్‌లో మాతా సరోవర్ రిసార్ట్స్ (ఫోన్ నంబర్లు 8500718552, 7901084959)
- పర్యాటక సంస్థ ఆధ్వర్యంలో నడిచే నాగార్జున మోటెల్ కాంప్లెక్స్ అతిథి గృహం (ఫోన్ నంబర్లు 9440968306, 9603242472)

విస్తరిస్తున్న హోటళ్లు

నాగార్జునసాగర్‌లో పర్యాటకులకు అనుగుణంగా ఇప్పుడు హోటళ్లు పెద్ద సంఖ్యలో వెలిశాయి. ప్రస్తుతం నాగార్జునసాగర్ పర్యాటకంగా అభివృద్ధి చెందుతుండడంతో పర్యాటకుల సంఖ్య భారీగా పెరిగింది. దీంతో హోటల్ బిజినెస్ కూడా పెరిగింది. హిల్ కాలనీలోని విజయ్ విహార్‌లో నడుస్తున్న హోటల్‌లో దేశ, విదేశీయులు, ఇతర రాష్ట్రాల ప్రజలు తినే రకరకాల వంటకాలు లభ్యమవుతున్నాయి. అలాగే బుద్ధవనంలో సిద్ధార్థ హోటల్, యూత్ హాస్టల్‌లో యూత్ ఫ్యామిలీ రెస్టారెంట్, మనోరమ హోటల్, ఫైలాన్‌కాలనీలో ఇటీవల ఏర్పాటైన టైగర్ వ్యాలీ హోటల్ పర్యాటకులను ఆకర్షిస్తోంది. కొత్త బ్రిడ్జి అవలివైపున మాతాసరోవర్ రెస్టారెంట్, రైట్‌బ్యాంకులో మాతాసరోవర్ హోటల్ వెలిశాయి.

- పర్యాటక సంస్థ ఆధ్వర్యంలో హిల్‌కాలనీలో విజయవిహార్ హోటల్‌లో 34 గదులు ఉన్నాయి. ముందస్తుగా ఆన్‌లైన్‌లో టీజీటీడీసీ.ఇన్ సైట్ ద్వారా బుక్‌చేసుకోవాలి. ఫోన్ నంబర్ 08680-277362.


విజయ్ విహార్ హోటల్





సాగర్ ఫైలాన్‌కాలనీలో ఇటీవల భారీ బడ్జెట్‌తో ఏర్పాటైన టైగర్‌వ్యాలీ హోటల్

అటవీ అందాల అర్బన్ పార్కు

సాగర్ జలాశయతీరంలో నాగార్జునసాగర్–హైదరాబాద్, సాగర్–నల్లగొండ రహదారుల (సమ్మక్క–సారక్కల)వెంట రూ.1.5 కోట్ల వ్యయంతో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ వన్యప్రాణుల అటవీకోర్ ఏరియాలో ఏర్పాటు చేసిన అర్బన్ పార్కు అటవీ అందాలను ఆరబోస్తుంది. 980 హెక్టార్ల విస్తీర్ణంలోని ఈ పార్కు ఏర్పాటు చేశారు. అటవీ ప్రాంతంలో గుట్టల మధ్య సాగర్ బ్యాక్ వాటర్ అందాలను తిలకించేందుకు నెల్లికల్లు అటవీ ప్రాంతంలో వ్యూ పాయింట్ నిర్మించారు. అడవీ అందాలను వీక్షించే పర్యాటకుల కోసం రెండు రకాల సఫారీ వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఆ వాహనంలో 10 కిలోమీటర్ల పరిధిలో పర్యటించేందుకు రూ.1,000, 24 కిలోమీటర్ల పరిధిలో పర్యటించేందుకు రూ.1500 వసూలు వేస్తున్నారు.



15 గేట్ల ద్వారా పులిచింతల నీటి విడుదల

హుజూర్‌నగర్: ఎగువన గల నాగార్జునసాగర్ నుంచి 3,29,932 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వచ్చి పులిచింతల ప్రాజెక్ట్‌లో చేరుతోంది. దీంతో పులిచింతల ప్రాజెక్ట్‌లోని 10 గేట్లను 2.5మీటర్లు, 5 గేట్లను 3మీటర్లు పైకి ఎత్తి 3,09,932 క్యూసెక్కుల నీటిని ప్రకాశం బ్యారేజ్‌కు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 16వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 31.91 టీఎంసీల నీరు ఉంది. పులిచింతల ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మించిన తెలంగాణ జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలోని నాలుగు యూనిట్ల ద్వారా 74 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.

యాదాద్రిలో సీఎం రేవంత్ సోదరుడి పూజలు


యాదాద్రి ఆలయంలో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కృష్ణారెడ్డి, కుటుంబ సభ్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వారిని శనివారం సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకామూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చనమూర్తుల చెంత అష్టోత్తర పూజలు నిర్వహించారు. వారికి అర్చకులు ఆశీర్వచనం చేయగా.. ఆలయాధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు. వారి వెంట ఈఓ భాస్కర్‌రావు ఉన్నారు.

నిస్వార్థ సేవకు చిరునామా 'కోణం ఫౌండేషన్'


మాట్లాడుతున్న జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి


రైతులకు అవార్డులు ఇస్తున్న రఘురామిరెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి తదితరులు

- ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి

నల్లగొండ: నిస్వార్థ సేవకు చిరునామా కోణం ఫౌండేషన్ అని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పి. రఘురామిరెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండలోని ఐటీ హబ్‌లో నిర్వహించిన కోణం ఫౌండేషన్ 8వ వార్షికోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. విదేశాల్లో గాక స్వదేశంలో కూడా ఐటీ కంపెనీ నెలకొల్పి అర్హులైన నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్న కోణం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సాందీప్ కోణం ఆలోచనలు అందరికీ స్ఫూర్తినిస్తాయన్నారు. డీఈఓ భిక్షపతి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంచేందుకు కోణం ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కోణం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సాందీప్ కోణం మాట్లాడుతూ.. శాస్త్రసాంకేతిక రంగాల్లో మానవాళి శ్రేయస్సును కాంక్షిస్తూ వినూత్న ఆవిష్కరణలు చేయడం, కృత్రిమ మేధస్సుతో సామాజిక సవాళ్లకు పరిష్కారాన్ని చూపడమే తమ సంస్థ లక్ష్యమన్నారు. అనంతరం తమ ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములైన రైతులు మరెడ్డి జానకిరాంరెడ్డి, నిమ్మనగోటి రమేష్, మందడి నర్సిరెడ్డికి కోణం కృషి పయనీర్ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ హుస్సేన్‌బాబు, ఎంపీ గోనారెడ్డి, కొలనుపాక రవికుమార్, బి. మహేష్, శ్వేత పాల్గొన్నారు.

సమగ్ర దర్యాప్తు జరిపించాలి

పెద్దవూర: సుంకిశాల పంప్‌హౌజ్ సైడ్‌వాల్ కూలిపోయిన ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలిసి శనివారం ఆయన సుంకిశాల పంప్‌హౌజ్‌ను సందర్శించి మాట్లాడారు. మేఘా ఇంజనీరింగ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ నిర్ణీత గడువు లోగా పంప్‌హౌజ్ నిర్మాణం చేపట్టకపోవడంతోనే ఈ ఘటన జరిగిందన్నారు. ఘటన జరిగిన సమయంలో కూలీలు లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పిందన్నారు. సుంకిశాల పంప్‌హౌజ్ నుంచి పర్వేదుల వరకు రోడ్డు అధ్వానంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, బండా శ్రీశైలం, కూన్‌రెడ్డి నాగిరెడ్డి, చినపాక లక్ష్మీనారాయణ, దుండంపల్లి సత్తయ్య, షేక్ బషీర్, పూల సత్యనారాయణ, దుబ్బ రామచంద్రం, బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సుంకిశాల పంప్‌హౌజ్‌ను పరిశీలిస్తున్న జూలకంటి రంగారెడ్డి తదితరులు